జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 21-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 461 పేజీలు: 4 వెల : రూ.7

# సమాధులను.. తవ్వేశారు!








* సెయింట్ జోసెఫ్ స్కూల్ పక్కన బరియల్ గ్రౌండ్ చదును చేసిన అగంతకులు
* ఎవరి సమాధులు ఎక్కడ ఉన్నాయో గుర్తుపట్టలేని స్థితి
* నేలమట్టం చేసిన పురాతన సమాధులు
* ఆందోళన వ్యక్తం చేస్తున్న క్రైస్తవులు
* ఆ నలుగురు పాస్టర్లపై ఆగ్రహం
* చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీకి అసోసియేషన్ ప్రతినిధుల వినతి

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 20 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని నాగావళి నది పక్కనే ఉన్న క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో సమాధులను తవ్వేసి చదును చేసిన ఘటనతో క్రైస్తవులు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం టౌన్ క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బరియల్ గ్రౌండ్‌కు వెళ్లి పరిశీలించారు. సమాధులు తవ్వేసి చదును చేసి వుండడాన్ని గమనించారు. ఎవరి సమాధులు ఎక్కడ ఉన్నాయో కూడా గుర్తు పట్టని విధంగా ఉండడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 150 వరకూ సమాధులు నేలమట్టం చేశారు. నలుగురు పాస్టర్లు కలిసి పాత సమాధులను తవ్వేయడం ఏంటని మండిపడ్డారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు, ఎస్పీకి అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జె.కృపానందం, కన్వీనర్ డీఎల్‌బీఎల్ కుమార్, అధ్యక్షులు ఎం.ఎలీషా, కార్యదర్శి ఎ.నవీన్ కుమార్, కోశాధికారి ఎం.శామ్యూల్ తదితరులు ఉన్నారు.

## దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

* సమస్యలు పరిష్కరించాలని జిల్లా సబ్ రిజిస్ట్రార్‌కు వినతి

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 20 (వార్త):** 2.0 ప్రైమ్ కార్డులో కొత్త విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు శనివారం పెన్‌డౌన్ చేశారు. జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద తమ షాపులన్నీ మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రైమ్ కార్డులో కూటమి ప్రభుత్వం కొత్త విధానం తీసుకొచ్చిందని, ఓటీపీలు పలుమార్లు రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, ఈ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న ప్రతిసారి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొత్త కొత్త విధానాలు తెస్తుండడంతో కొనుగోలు, అమ్మకం దారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కక్షిదారులకు, స్టాంప్ వెండర్లకు, దస్తావేజు లేఖరులకు సజావుగా సులభతరమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కింతలి రమణారావు, శ్రీనివాస పాత్రో, దామోదర మెహర్, కె.దుర్గాప్రసాద్, తాళ్లవలస కుమారస్వామి, తౌగరాం భువన మోహన్, చింతనిప్పుల అప్పలరాజు, అన్నెపు సీతారాం, అల్లు రాజారావు, బలగ రామకృష్ణ, దేవానంద్, తదితరులు పాల్గొన్నారు.



## వసప కేజీబీవీలో.. బియ్యం పక్కదారి!



* దసరా సెలవులకు గుట్టుచప్పుడు కాకుండా తరలింపునకు ప్లాన్
* విద్యాలయంలో ఓ గదిలో దాచిన పది క్వింటాళ్ల బియ్యం
* అజ్ఞాత వ్యక్తి సమాచారంతో గుట్టురట్టు
* ఆకస్మిక తనిఖీ చేసిన తహశీల్దార్
* 10.5 క్వింటాళ్ల బియ్యం సీజ్



**కొత్తూరు, సెప్టెంబరు 20 (వార్త):** వసప కస్తూరీభా గాంధీవిద్యాలయంలో బియ్యం పక్కదారి పడుతోంది. ఎప్పటి నుంచి ఇది జరుగుతుందో తెలియదు గాని.. ఓ అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారంతో ఇక్కడ జరుగుతున్న బియ్యం అక్రమ రవాణా తంతు గుట్టు రట్టయింది. దీని వెనుక ఎవరెవరు ఉన్నారన్న దానిపై రెవెన్యూ అధికారులు కూపీ లాగుతున్నారు. దసరా సెలవులకు విద్యార్థులు వెళ్లిపోయిన తర్వాత బియ్యం పక్కదారి పట్టించేందుకు గాను విద్యాలయంలో ఓ గదిలో ఏకంగా 10.5 క్వింటాళ్ల బియ్యంను కేజీబీవీ అధికారులు దాచి ఉంచారు. ఈ విషయాన్ని ఓ అజ్ఞాత వ్యక్తి తహశీల్దార్ కొప్పల బాలకృష్ణకు చేరవేశారు. దీంతో ఆయన శనివారం మధ్యాహ్నం వసన కేజీబీవీని ఆకస్మికంగా సందర్శించారు. బియ్యం స్టాక్ రికార్డులు పరిశీలించారు. స్టాక్ 248 కిలోలు ఉండాల్సి ఉండగా అదనంగా 1150 కిలోల బియ్యం ఉన్నట్టు గుర్తించారు. పాఠ శాలలోని ఓ గదిలో 10.5 క్వింటాళ్ల బియ్యం గుర్తించారు. దీనిపై ప్రిన్సిపాల్ రాధికను తహశీల్దార్ నిలదీశారు. ఆమె నుంచి ఎటువంటి సమాధానం రాక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని వీఆర్వోకు అప్పగిం చారు. నివేదికను సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీకి అందజేస్తామని తహశీల్దార్ తెలిపారు. కాగా, గతంలో కూడా ప్రిన్సిపాల్ రాధికపై పలు ఆరోపణలు ఉన్నాయి.

## భావితరాలకు స్వచ్ఛ పర్యావరణాన్ని అందిద్దాం

* 2 నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లోనూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ
* ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్, ప్లాస్టిక్ బాటిల్స్ వాడకూడదని ఉత్తర్వులిస్తాం
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* పెద్దగణగల్లవానిపేట బీచ్‌లో చెత్త తొలగించిన అధికారులు
* ఘనంగా అంతర్జాతీయ తీర ప్రాంతం శుభ్రపరచు దినోత్సవం



2లో

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## వంశధారలో మునిగి హెచ్ఎం మృతి

**నరసన్నపేట/జలుమూరు, సెప్టెంబర్ 20 (వార్త):** గోపాలపెంట ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఎం. నాగేశ్వరరావు (54) వంశధారలో మునిగి మృతి చెందారు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో వంశధార నదికి స్నానానికి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబీకులు, స్థానికులు నదిలో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం వంశధార నదిలో గాలించగా శనివారం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# భావితరాలకు స్వచ్ఛ పర్యావరణాన్ని అందిద్దాం

*** 2 నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లోనూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ * ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్, ప్లాస్టిక్ బాటిల్స్ వాడకూడదని ఉత్తర్వులిస్తాం * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * పెద్దగణగల్లవానిపేట బీచ్‌లో చెత్త తొలగించిన అధికారులు * ఘనంగా అంతర్జాతీయ తీర ప్రాంతం శుభ్రపరచు దినోత్సవం**




**శ్రీకాకుళం,సెప్టెంబర్20 (వార్త):** భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. అంతర్జాతీయ తీర ప్రాంత శుభ్రపరచు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పెద్దగణగల్లవానిపేటలో స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలసి ఆయన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 193 కిలో మీటర్ల సువిశాలమైన తీరప్రాంతం ఉందన్నారు. బీచ్ శుభ్ర పరచు ప్రాంతంగా శ్రీకాకుళం మండలం పెద్దగణగల్లవానిపేట బీచ్‌ను శుభ్రపరచుటకు ప్రభుత్వం ఎంపిక చేసిందని చెప్పారు. బీచ్‌లో ఉన్న చెత్తను ఏరివేసి డస్ట్ బిన్‌లో వేశారు. పర్యాటకులు బీచ్‌లను శుభ్రంగా ఉంచాలన్నారు. బీచ్ లోకి ఎవరైనా వస్తే ఉపయోగించే చెత్తను డస్ట్ బిన్‌లో లేదా మీతోనే తీసుకువెళ్లాలని చెప్పారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కింద జిల్లాలో ఇప్పటికే 912 గ్రామాల్లో 221 గ్రామాల వరకు ఓడిఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్‌గా చేయడమైనదని, శనివారం కూడా 31 గ్రామాలను ఓడిఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్‌గా డిక్లేర్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ గ్రామాల్లో పూర్తిగా పరిశుభ్రతపై అవగాహన, సోలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ కింద ఇంకుడు గుంతలు, కంపోస్టింగ్ ఫెసిలిటీస్ ఉంటే ఆ గ్రామాన్ని మోడల్ గ్రామంగా ప్రకటించవచ్చన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ యూజ్డ్ ప్లాస్టిక్‌గా డిక్లేర్ చేస్తామన్నారు. ఒకసారి వాడిన ప్లాస్టిక్ అంటే స్ట్రాస్, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్‌ను మున్సిపాలిటీలో వాడకూడదని ప్రకటిస్తామన్నారు. అక్టోబరు2 నుండి అన్ని మున్సిపాలిటీల్లోను, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ లోనూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ చేయబోతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం నుండే ప్లాస్టిక్, ప్లాస్టిక్ బాటిల్స్ వాడకూడదని స్పష్టం చేశారు. మనకు మనంగా పక్కాగా అమలు చేసినప్పుడే ప్రజలు కూడా అమలు చేస్తారన్నారు. ఈ ఒక్కరోజు కాకుండా ప్రతీ రోజూ బీచ్ పరిశుభ్రత ఉండాలని ఆయన కోరారు. పెద్దగణగల్లవానిపేటలో గతంలో యోగాంధ్రలో ప్రపంచ రికార్డు వచ్చిందని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను ఇక్కడ ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తి నిషేధానికి సహకరించాలని, సముద్రంలో చెత్త వేయడం ఆపాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ వ్యర్థాలను సముద్రంలోకి నేరుగా విడిచి పెట్టడం వలన సముద్రపు నీరు కలుషితమై మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రజల నుండి పెద్ద ఎత్తున సహకారం వచ్చిన నాడే నియంత్రణ చేయగలమన్నారుఅక్టోబరు 2 నుండి ప్లాస్టిక్ రహిత శ్రీకాకుళంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ పెద్దగణగల్లవానిపేట బీచ్‌లో చాలా చెత్త ఉందని, చెత్తను తొలగించే బాధ్యత అందరమూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్ మాట్లాడుతూ చెత్తను డస్ట్ బిన్‌లోనే వేయాలన్నారు. ఈ సందర్భంగా బీచ్ లో ఉన్న వేరి డస్ట్ బిన్లలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శాసన సభ్యులు గొండు శంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, ఇతర అధికారులు, యువత, వివిధ కంపెనీల ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణ శ్రీ, డిపిఓ కె.భారతి సౌజన్య, తహసిల్దార్ గణపతిరావు, ఎంపిడిఓ ప్రకాశరావు, డిస్ట్రిక్ట్ కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పి.రాజశేఖర్, రిటైర్డ్ జాయింట్ ఛీఫ్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ కె. రమేష్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎఈ సిహెచ్ హరీష్, పెద్దగణగల్లవానిపేట సర్పంచ్ బర్రి రామారావు, యువత, వివిధ కంపెనీల ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చిన్న మర్రిపాడులో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ శిబిరం

**సంతబొమ్మాళి, సెప్టెంబరు 20 (వార్త):** నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ఒ పరిమళ, ఆయుర్వేద వైద్యశాల ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మర్రిపాడు సబ్ సెంటర్ పరిధి చిన్న మర్రిపాడులో శనివారం 117మందికి వైద్య సేవలు అందించారు. బిపి, షుగర్, క్యాన్సర్, టిబి ఆరోగ్య పరీక్షలు, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు , కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు స్థాయి , వ్యక్తిగత పరిశుభ్రత పోషకాహార ప్రాముఖ్యత గురించి ఆరోగ్య విద్య అందించి వైద్య చికిత్సలు చేశారు. గర్భిణీలు అధిక రక్తపోటు 19 మంది బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ ముగ్గురు ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నలుగురు సెర్వికల్ క్లీనింగ్ ఇద్దరూ , క్షయ స్క్రీనింగ్ ఏడుగురు జ్వర కేసులు ఏడుగురు కంటి పరీక్షలు 52 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ పరిమళ మాట్లాడుతూ వైద్య పరీక్షలు చేయడం వలన వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించడం వల్ల చికిత్స చేయడం సులభతరం అవుతుందని, గర్భిణీలు ప్రసూతి పరీక్షలు చేయించుకోవడం వల్ల ప్రసవ సమయంలో, ప్రసవానంతరం ఎలాంటి దుష్పరిణామాలు




లేకుండా తల్లి బిడ్డ సురక్షితంగా ఉంటారని ఆమె తెలిపారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రాం మహిళల పాలిట ఆరోగ్య సంజీవిని లాంటిదని ఆమె అన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ శిబిరాలు అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే 22వ తేదీన సీతానగరంలో, 23వ తేదీన భావనపాడు లో, 24వ తేదీన నౌపడ పరిధిలో ఈ శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎం ఎల్ హెచ్ పి లు, ఆశలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ గ్రంథాలయంలో 'డొనేట్ ఎ బుక్' ప్రారంభం

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 20(వార్త):** నగరపాలక సంస్థ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రెండురోజుల క్రితం విజయవంతంగా నిర్వహించిన ప్లాస్టిక్ ఎక్స్ఛేంజ్ మేళా విజయోత్సాహాన్ని స్ఫూర్తిగా తీసుకొని, కమిషనర్ బి.వి.డి. ప్రసాదరావు శనివారం 'డొనేట్ ఎ బుక్' కార్యక్రమాన్ని స్థానిక గాంధీ పార్క్‌లోని మున్సిపల్ గ్రంథాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మన ఇళ్లలో ఉపయోగం తీరిన తర్వాత అల్మారాలో మిగిలిపోయే పోటీ పరీక్షల పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, కథలు, వ్యక్తిత్వ వికాస గ్రంథాలు మున్సిపల్ లైబ్రరీలకు అందజేస్తే వాటిని మరికొందరు చదివి విజ్ఞానం పెంపొందించుకుంటారన్నారు. ఇలా పుస్తకం పంచుకునే ప్రతి ఒక్కరూ విద్యా దానం చేసిన వారిగా నిలుస్తారన్నారు. హార్టికల్చర్ ఏడి ప్రసాద్ రావు మాట్లా డుతూ, "డొనేట్ ఎ బుక్" ఒక గొప్ప ఆలోచన అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్ని మున్సిపల్ లైబ్రరీలకు విస్తరించడంతో పాటు నగరపాలక సంస్థ కార్యాల యంలో ప్రత్యేక కేంద్రం కూడా ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామని తెలిపారు. కమిషనర్ పిలుపు మేరకు పెద్ద సంఖ్యలో నగర ప్రజలు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ ఉద్యోగులు గాంధీ పార్క్‌కు చేరుకుని తమ వెంట తెచ్చిన పుస్తకాలను డొనేట్ చేశారు.



## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

**ఎల్ఎన్‌పేట, సెప్టెంబరు 20 (వార్త):** లక్ష్మీ నర్సు పేట గ్రామంలో గల మోడల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మొక్కలను నాటి పరి రక్షించాలన్నారు. ఈ కార్యక్ర మంలో హెచ్.ఎం.బి.రమాదేవి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డా.ఎం.కె. మిశ్రో, ఉపాధ్యాయులు ఎన్.రామారావు, పి.లక్ష్మణరావు, టి.ఉపేంద్ర పాల్గొన్నారు.



# వ్యవహారశైలి మారితేనే పరిశుభ్రత నిలుస్తుంది

*** కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 20(వార్త):** పరిశుభ్రత కార్యక్రమాలు ఒకరోజు చేస్తే సరిపోవు, ప్రజల వ్యవహార శైలి, ప్రవర్తనలో మార్పు వచ్చినప్పుడే ఫలితం కనిపిస్తుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ - ప్రభుత్వం వైద్య కళాశాల విద్యార్థులతో కలిసి స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బయోమెడికల్ వ్యర్థాలు అత్యంత ప్రమాదకరమైనవన్నారు. వాటిని వేర్వేరు వర్గాలుగా వేరు చేయడం అలవాటు కావాలన్నారు. ఆసుపత్రిలో చదువుతున్న మీరంతా మరింత బాధ్యతతో ఉండాలన్నారు. దేశంలో రాష్ట్రంలో రోజుకు రెండుసార్లు చెత్త సేకరణ జరిగినప్పటికీ రోడ్లపై చెత్త కనిపిస్తూనే ఉందని, తాను అధికారికంగా పారిస్‌లో పర్యటించినప్పుడు వారానికి రెండుసార్లు మాత్రమే చెత్త సేకరణ చేసినా పరిశుభ్రత కనిపిస్తోందని స్వయంగా చూశానని ఉదాహరణగా చూపారు. ఇది ప్రజల ప్రవర్తనలో మార్పు వల్లే సాధ్యమైంది. మనమూ అలాంటి అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పరిశుభ్రత కార్యక్రమాలు ఒక్కరోజు చేసే కార్యక్రమం సరిపోదు, ప్రతిరోజు చెత్త మేము రోడ్డు మీద వేయకూడదు అని అనుకున్నప్పుడే ఇది



సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం స్వచ్ఛఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిజిహెచ్ ఆవరణంలో మొక్కలు నాటారు. విద్యార్థులతో చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి ఆరు నెలలు దానిని సంరక్షించాలని సూచించారు. క్యాంపస్లో వీధి కుక్కల బెడద ఉందని, మహిళా విద్యార్థుల హాస్టల్‌లో లెగ్ ఆపరేటెడ్ డస్ట్‌బిన్స్ సరిపడా ఏర్పాటు చేయాలని, లోపల ఇంటర్నెట్ రావడం లేదని విద్యార్థులు తెలియజేశారు. దీనిపై సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మెడికల్ కాలేజ్ ఆవరణలో కలియ తిరుగుతూ డ్రైనేజీ, శానిటేషన్ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులు చూపించిన సమస్యలను స్వయంగా గమనించి పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బాలికల వసతి గృహంలో వారితో కలసి భోజనం చేశారు. క్యాంపస్ పరిశుభ్రతను కాపాడుకోవడంలో విద్యార్థులు, సిబ్బంది ముందడుగు వేస్తేనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ అప్పలనాయుడు, ఆర్ఎంఓ డాక్టర్ సుభాషిని, జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు హనుమంతు సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సత్యసాయి సంస్థ ఆధ్వర్యంలో వ్యాచరచన పోటీలు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు20(వార్త):** శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో సత్య సాయి సేవ సంస్థ, ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీ లను స్కూల్ చైర్మన్ డి. కృష్ణ మూర్తి రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలు 8వ తరగతి నుండి 10 వ తరగతి వరకు జరిగాయి. కర్తవ్యమే దైవము అనే అంశం పై నిర్వహించిన ఈ కార్యక్రమం లో స్కూల్ మేనేజర్ కె. సి. పూరి, సురేఖ, పద్మజసత్యసాయి సంస్థ ప్రెసిడెంట్ గోపాల్ రావు పాల్గొన్నారు.




## నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

**మందస, సెప్టెంబరు 20(వార్త):** నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అధికారులు పిలుపునిచ్చారు. మందస మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వై.వెంకటరమణ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులకు చదవడం, రాయడం నేర్పించాలన్నారు. వెలుగు సిబ్బంది, ఎంఎన్ఆర్ఈజీఎస్ మేట్లు, వెలుగు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.తిరుమలకుమార్, ఉపాధి ఏపీఓ బీవీ హరికృష్ణ, వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

## పర్యావరణంపై అవగాహన పెరగాలి




**జలుమూరు, సెప్టెంబరు 20(వార్త):** ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన కల్పించవలసిన అవసరం నేడు ఎంతైనా ఉందని శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష తెలిపారు. శనివారం జలుమూరు మండలం కొండపోలవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ..చిన్నతనం నుంచే మొక్కలు నాటే కార్యక్రమాన్ని అలవర్చుకునే విధంగా నేర్పించాలని ఆమె సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

## చెత్త సమస్యతో ఇబ్బందులు



**జలుమూరు, సెప్టెంబరు 20 (వార్త):** చల్లవానిపేట వద్ద జలుమూరుకు వెళ్లే దారిలో స్థానికులు చెత్తాచెదారం పారవేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఈ వాసన భరించలేక అటుగా వెళ్లే బాటసారులు, వాహన చోదకులు ముక్కు మూసుకొని ప్రయాణించాల్సి వస్తోందని అంటున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు సత్వరమే స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిస్కారం చూపుతారని వేడుకొంటున్నారు.

## ముందస్తు దసరా వేడుకలు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు20(వార్త):** స్థానిక స్వర్ణభారతి విద్యా సంస్థల ఆధ్వ ర్యంలో ముందస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు విచిత్ర వేష ధారణలతో అలరించారు. చైర్మన్ చాట్ల తులసీదాసు రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. శాంతినికేతన్ హైస్కూల్ లో దసరా వేడుకలు స్కూల్ చైర్మన్ డి. క్రిష్ణ మూర్తి రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో ఇందిరా రెడ్డి, స్కూల్ మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, శంకర్, పద్మజ, శాంతి, రవి, జయలక్ష్మి, రాజ్యలక్ష్మి, మీనా, పార్వతి, ప్రమీల, సరోజిని, శిరీష ఎస్. పి. ఎల్ జిహారిక ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్ ప్రియ, సెక్రటరీ డి. హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## సిక్కోలు ఉద్దానం సేవా సమితి దాతృత్వం

**మందస, సెప్టెంబరు 20(వార్త):** సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఉదారత చూపించింది. తల్లిదండ్రులు కోల్పోయిన టెక్కలి మండలంలోని అక్కవరం గ్రామానికి చెందిన మురపాల భవానికి సమితి ప్రతినిధులు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. వీరికి దాతలు సహాయం చేయాలని వారు కోరారు.



# నరసన్నపేట కాలేజీ రోడ్డులో ట్రాఫికర్



**నరసన్నపేట, సెప్టెంబరు 20(వార్త):** నరసన్నపేట కళాశాల రహదారిలో నిరంతర ట్రాఫిక్ జామ్ తో ఇబ్బందులకు గురవుతున్న విద్యార్థులు ప్రయాణికులు, ఈ రహదారిపై ప్రయాణానికి భయపడుతున్నారు. గోతులమయం గా మారిన రహదారి ఓవైపు, ట్రాఫిక్ సమస్య మరోవైపు విద్యార్థులకు పట్టణ ప్రజలకు ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తుంది. లారీలు భారీ వాహనాల రాకపోకలతో ఈ సమస్య మరీ జఠిలమవుతుంది. ట్రాఫిక్ నియంత్రణలో అధికారులు కఠిన చర్యలు చేపట్టకపోవడంతో ప్రతిరోజు నరకయాతన తప్పడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఉదయం సాయంత్రం సమయాలలో ఈ సమస్య మరీ దారుణంగా ఉందని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల రహదారిలోకి భారీ వాహనాల అనుమతిని నిలిపివేస్తే, ట్రాఫిక్ సమస్యకు కొంతవరకు ఉపశమనం కలుగుతుంది. కళాశాల రహదారి ఆక్రమాలపై కూడా అధికారులు దృష్టి సారిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. అధికారులు రాజకీయ నాయకులు ప్రకటనలకే పరిమితం కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాల రహదారి అభివృద్ధిపై అధికారులు నాయకులు దృష్టి సారిస్తే నరసన్నపేట పట్టణానికి ట్రాఫిక్ సమస్యకు కొంత ఉపశమనం లభిస్తుంది. బజారు అభివృద్ధి చేసి కళాశాల రహదారి ఆక్రమణలు తొలగించాలని స్థానికుల విజ్ఞప్తి చేస్తున్నారు.

# పర్యావరణంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలి



**పోలాకి, సెప్టెంబరు 20(వార్త):** పోలాకి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రతతోనే చక్కని ఆరోగ్యం సొంతమవుతుందని పరిసరాలు శుభ్రంగా చేసుకోవడం అంతర్జా బాధ్యతని అందరూ బాధ్యతగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ రక్షణ కోసం కాలుష్య నియంత్రణపై ప్రతి ఒక్కరు దృష్టి సాధించగలిగితే ఉత్తమ ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందని వివరించారు. అనంతరం ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఎసిఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, డోల ప్రసాద్, గొంరెల యర్రయ్య, చిట్టి సింహాచలఆమ్, కరుకోల దుష్యంత్, సూరపు నాని, తార రామకృష్ణ, గొండు మురళి, యాగాటి లక్ష్మణరావు,కోడ తాతారావు మరియు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఎంపీడీవో, తహశీల్దార్, అన్ని శాఖల అధికారులు, వెలుగు సిబ్బంది, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మనుగడకు హిందీ భాష నేర్చుకోవాలి

**మందస, సెప్టెంబరు 20(వార్త):** మనుగడకై హిందీ భాష నేర్చుకోవాలని పల్లిసారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యవ్వారి కాంతారావు కోరారు. పల్లిసారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు యవ్వారి కాంతారావు అధ్యక్షతన హిందీ పక్షోత్సవాలు భాగంగా పలు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధికంగా మాట్లాడుతున్న భాషలో హిందీ రెండవదని, భారతదేశంలో ఎక్కడైనా మనుగడ సాగించాలంటే జాతీయ భాష హిందీని తప్పక నేర్చుకోవాల్సిందేనని అన్నారు. చిన్నతనంలో ఏ భాషనైనా సులువుగా నేర్చుకునే సామర్థ్యం ఉంటుందని, విద్యార్థులందరూ తప్పనిసరిగా హిందీ నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. జాతీయ అధికార భాషా ఉపాధ్యాయ సహాయకుడు ఎన్.విష్ణుమూర్తి మాట్లాడుతూ వ్యవహార రాజేంద్ర సింగ్ హిందీ భాషను భారతదేశం అంతటా వ్యాప్తి చేయడంలో గాంధీజీ సహాయంతో ఎనలేని కృషి చేశారని, దీని ఫలితంగానే హిందీ భాషను జాతీయ అధికార భాషగా సెప్టెంబర్ 14, 1949నుండి గుర్తించారన్నారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్.పాపారావు పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా ప్రత్యేక స్టడీ మెటీరియల్ అందజేయగా, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్ పర్సన్ దున్న కవితరమేష్ ప్రత్యేకంగా ఆయనను అభినందించారు. హిందీ పక్షోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన తదితర పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు.



కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుంట కోదండరావు, కె.మాధవరావు, బి.అన్నపూర్ణ, ఎం.హరనాథ్, ఎస్.సీతమ్మ, కె.నాగభూషణ్, టి.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర ....స్వచ్ఛ్ ఆంధ్ర



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు20 (వార్త):** స్థానిక ప్రభుత్వ హాస్పిటల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగముగా హాస్పటల్ సూపరిండెంట్ డాక్టర్ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఏ వో కె రామారావు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి గౌతమి, డాక్టర్ శిల్ప , డాక్టర్ ఎన్ నీలిమ ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. గాంధీ పార్కు నందు కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రోటరీ క్లబ్ సౌజన్యంతో సంతపేట లో ఉన్న పంపు హౌస్ నందు కూడా మొక్కలు నాటే కార్యక్రమంచేపట్టారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కుమార్ సచివాలయ శానిటేషన్ మరియ పర్యావరణ కార్యదర్శులు, ఆర్ పి లు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికల కళాశాల లో శ్రమదానం, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారుప్రోజెక్టు ఆఫీసర్ రజనీ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన

ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ నవ్యశ్రీ మహంతి, సుధాకర్.కళాశాల అధ్యాపకులు, భోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## తీరంలో పరిశుభ్రతా వారోత్సవాలు



**మందస, సెప్టెంబరు 20(వార్త):** అంతర్జాతీయ తీర ప్రాంత పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్క రించుకొని నడుమూరులో విద్యార్థుల సహకారంతో ట్రీ ఫౌండేషన్, మెరైన్ పోలీస్, ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ సంయుక్తంగా పరిశుభ్రత వారోత్సవాలను నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి జీవ సమతుల్యం చేయాలని ఫారెస్ట్ ఆఫీసర్ పిలుపునిచ్చారు. తీరం వెంబడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను గోనే సంచుల్లో నింపి రీసైక్లింగ్ పంపించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్పు చక్రధరరావు, అప్పలనాయుడు, స్థానిక వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు బైపల్లి బాబురావు, అటవీ శాఖ సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

# ఉల్లాస్‌ంగా..ఉత్సాహంగా ..!






**జి.సిగడాం, సెప్టెంబరు 20(వార్త):** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా మార్చడమే 'ఉల్లాస్'లక్ష్యమని డ్వామా పీడీ సుధాకర్, డీడీ అల్లు సోమేశ్వరరావు అన్నారు. శనివారం జి.సిగడాంలోని బలిజ కళ్యాణ మండపంలో ఎంపీడీవో జి.రామకృష్ణా రావు ఆధ్వర్వంలో 380 మందితో ఉల్లాస్‌పై అవగా హన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజల జీవన పరిస్థితులు మారిన నేపథ్యంలో ప్రతి అంశంలోనూ సాంకేతికత, డిజిటల్ విధానం, నగదు రహిత లావాదేవీలు, ముఖ్యంగా మహిళలు పొదుపు సంఘాల్లో ఉండేలా చూడటం, బ్యాంకు ఖాతాలు ఉన్న వారికి వాటిని నిర్వహించడం వచ్చేలా అన్ని విషయాలు తెలియజేయడమే లక్ష్యమన్నారు. చదువు రాని వారు పక్కవారిపై ఆధారపడుతున్న పరి స్థితులను అధిగమించేలా అందరిలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసేందుకు పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో 15 ఏళ్లు దాటిన వారికి విద్యను అందించే వ్యవస్థ ఏదీ ప్రస్తుతం అందుబాటులో లేదని. అందుకే ప్రత్యామ్నాయంగా మరోమారు గ్రామీణ ప్రాంతాల్లో వయోజన విద్యా కేంద్రాలను ప్రారంభించేందుకు ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయని చెప్పారు.ఈ సామావేశంలో పరిషత్ ప్రత్యేక అహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, ఏపీడీ సీబీ హరిత,ఎంఈఓ ముళ్ళ శ్రీనివాసరావు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదేల పురుషోత్తం, ఎపీఎం రెడ్డి రామకృష్ణ, ట్రైనింగ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



**కోటబొమ్మాళి, సెప్టెంబరు 20(వార్త):** కోట బొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలలోని పంచాయతీ రాజ్ విభాగానికి చెందిన పలు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ సూపరెండెంట్ ఇంజనీర్ వీరంనాయుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండు మండలాలకు చెందిన ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనుమతి పొందిన పనులు మండల ఇంజనీర్‌ల పర్యవేక్షణలో ఎంతవరకు పని చేశారని సహాయకులను అడిగి తెలుసుకున్నారు. పనులకు ఎక్కడా అంతరాయం కలగనియవద్దని, సమయంలోపే పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎలాంటి అలసత్వం వహిస్తే చర్యలకు వెనుకాడబోమని ఆయన అన్నారు. ఈ సమావేశంలో డీఈ సుధకరరావు, జేఈ అంజిత్‌కుమార్ ఉన్నారు.

# నీట్‌లో ఉజ్వలం

### -మెడికల్ సీటు సాధించిన ఉద్దానం విద్యార్థిని



**మందస, సెప్టెంబరు 20(వార్త):** కష్టపడితే విజ యం సాధించవచ్చు. కృషి, పట్టుదలతో ఉద్దానానికి చెందిన ఓ విద్యార్థిని ఆ విజయాన్ని సొంతం చేసు కుంది. ఇటీవల ఉద్దానానికి చెందిన పలువురు తమ ప్రతిభను చాటి చెబుతున్నారు. పురుషులతో పాటు మహిళలు కూడా 'తగ్గేదేలే' అంటూ దూసుకు పోతున్నారు. మందస మండలంలోని లోహారిబందకు చెందిన నర్తు ఉజ్వల నీట్ పరీక్షలో 497మార్కులు, తెలంగాణా రాష్ట్రంలో 674వ ర్యాంక్ సాధించింది. ఎస్జీఎంఎస్(సిద్దిపే)లో ఎంబీబీఎస్ చదవడానికి ఫ్రీ సీట్ సాధించింది. తల్లిదండ్రులు శంకరరావు, జీవిత సహకారంతో విజయం సాధించిన ఉజ్వలకు లోహారి బంద పంచాయతీ ప్రజలు అభినందనలు తెలిపారు. ఉజ్వల నాలుగేళ్ళు ఎంబీబీఎస్ ఉన్నత విద్యను అభ్యసించి మీ తల్లిదండ్రులకు, పంచాయతీ గొప్ప పేరు తీసుకురావాలని గ్రామపెద్ద గొరకల పాపారావు ఆకాంక్షించారు.

# ఉండ్రుకుడియాలో సేవా పక్వాడ్



**పలాస, సెప్టెంబరు 20(వార్త):** సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా ఉంద్రుకుడియ గ్రామంలో శనివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి మోడీ చిత్రపటానికి గ్రామస్తులతో కలిసి పాలాభిషే కం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు పాలవలస వైకుంఠరావు మాట్లాడుతూ మోడీజీ దేశానికి చేసిన సేవలు కొనియాడారు. గుజరాత్ లోని వాద్ నగర్ లో పుట్టిన నరేంద్ర దామోదర దాస్ మోడీ బాల్యం అంతా కష్టాలమయం అని అని, ఆయన తండ్రి ఒక చిన్న టీస్టాల్ నీ నడిపేవారు, అక్కడ చిన్నారి నరేంద్ర ఆయనకు పనిలో సహాయం చేస్తుండేవారు. 1965 లో భారత్, పాక్ యుద్ధ సమ యంలో ఆ రైల్వే స్టేషన్ గుండా ప్రయాణిస్తున్న సైని కులకు టీ అందించిన సంఘటన చిన్నారి నరేంద్ర మనసులో గాఢమైన ముద్ర వేసింది. దేశ సేవకు తన జీవితాన్ని అంకితం చేయాలనే కాంక్షను ఆయనలో రగిల్చింది. 1975లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఆయన తన స్వరం వినిపించారు. కరపత్రాలను పంచడం, కార్యకర్తలను సమీకరించడం వంటి పనులతో ఆనాటి నియంతృత్వ పాలనకు ఎదురొడ్డి నిలిచారు. బాల్యం లో సంఘ్ లో ఒక బాగమయ్యారు, అనంత కాలం లో క్రియాశీల సభ్యుడై దేశ సేవకు ప్రతిజ్ఞ పూనారు. సంఘ్ లో అనేక పదవులు చేపట్టారు. 2001 లో గుజరాత్ ముఖ్యమంత్రి అయిన అనంతరం భూకంపంలో తీవ్రంగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని పారిశ్రా మిక, మౌలిక, పెట్టుబడులకు జాతీయ అంత ర్జాతీయ గుర్తింపు తెచ్చి అభివృద్ధి పథంలో నడిపించారు 2014 లో బీజేపీ కేంద్రంలో స్పష్టమైన మెజారిటీ వచ్చి ఆయన ప్రధానమంత్రి అయ్యారు. ప్రజల వద్దకు పార్టీ భావజాలాన్ని తీసుకెళ్లడం జాతీయ వాదాన్ని అభివృద్ధిని ఒకే సూత్రంలో ముందుకు తీసుకెళ్లడం ద్వారా, 2019 లో కూడా రెండవసారి ప్రధాన మంత్రి గా ప్రమాణస్వీకారం చేసి మోదీ చరిత్ర సృష్టించారు. 2024 లో లోకసభ ఎన్నికలలో మోదీ నాయకత్వంలో మరో సారి బిజెపి విజయం సాధించి వరుసగా మూడోసారి ప్రధాన మంత్రిగా ప్రమాణస్వీకా రం చేసి ఈ దేశానికి సేవచేసే రెండవ ప్రధాన మంత్రిగా నిలిచారు. దేశంలో రాజకీయ సుస్థిరతను అందించ డమే కాకుండా విశ్వవేదికపై భారత్ కు ప్రతిష్టాత్మక మైన స్థానం సంపాదించి పెట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమం లో పలాస నియోజక వర్గ బీజేపీ కన్వీనర్ రామానంద స్వామి జీ, జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఎండీ ఫయాజ్ అహ్మద్ (ఘనీ) జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు పొందర దుద్దిస్తి పాత్రో, కంచరాన మహందత, బమ్మిడి నారాయణ రావు, కొర్ల లక్ష్మి, కొర్ల పద్మావతి,సరస్వతి, కంచరన పుణ్యవతి,కె కామేశం, ఎం కుమారస్వామి, కె.ఈశ్వర రావు, కె చంద్రశేఖరం, బమ్మిడి భాస్కరమ్మ పాల్గొన్నారు.



## క్రీడా పోటీలలో సొండిపూడి విద్యార్థుల సత్తా

**మందస, సెప్టెంబరు 20(వార్త):** సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడలలో ప్రతిభ చూపారు. ఇటీవల జరిగిన ఎస్.జి.ఎఫ్ పలాస నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో విజయ దుందుభి మోగించి, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలలో పి.తారకేశ్వరరావు(అండర్-14 విభాగంలో 200 మీటర్ల పరుగు పందెం), పి.పూజ(షార్ట్ పుట్), కె.ధర్మతేజ(కబడ్డీ ), పి.రాహుల్(అండర్ 17విభాగంలో 1500 మీటర్లు పరుగు పందెం)లకు ఎంపికయ్యారు. సత్తా చాటిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం సుందర్ సాల్మన్, పీడీ ఎస్.విజయ్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

## శ్రీముఖలింగం జడ్పీ స్కూల్‌ను పరిశీలించిన డీఈవో



**జలుమూరు, సెప్టెంబరు 20(వార్త):** దసరా సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రవిబాబు తెలిపారు. శనివారం జలుమూరు మండలం శ్రీముఖలింగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. సెలవు దినాలకు సరిపడా హోంవర్కు విద్యార్థులకు ఇవ్వాలని టీచర్లకు సూచించారు. అలాగే అన్ని పాఠశాలల వద్ద నైట్ వాచ్మెన్తో పాటు ఆయాలను నియమించాలన్నా. ఎంఈఓ బమ్మిడి మాధవరావు పాల్గొన్నారు.

## ఉల్లాసంగా అక్షరాంధ్ర




**కోటబొమ్మాళి, సెప్టెంబరు 20(వార్త):** కోటబొమ్మాళి మండలపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో శనివారం అక్షరాంధ్ర ఉల్లాస్ శిక్షన కార్యక్రమం ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షన పొందినవారు ఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌హెచ్‌జిలతో ఉన్న నిరక్ష్యరాస్యులకు చదవడం , రాయడంతో పాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, లీగల్ అక్షరాస్యత, చైల్డ్‌కేర్ ఎడ్యూకేషన్ అంశాలపై భోధిస్తారని ఆయన తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన వారికి బోధించేందకు సంబందిత పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పి. సూర్యనారాయణ, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో జి. హరిప్రసాద్, టీసీ. రాంబాబు, రిసోర్సు పర్సన్స్ ఎన్. లక్ష్మణరావు, ఎం.బోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

## భవానీ భక్తులకు మాలాధారణ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు20(వార్త):** విశ్వావసు నామ సంవత్సర అశ్వియజ మాసం శుక్ల పాడ్యమి 22 నుండి విజయదశమి గురువారం02 వరకు 11 రోజులు పాటు దసరా నవరాత్రులు జరుగునని.ఈ సంవత్సరం విశేషం గా రెండు రోజులు అధిక దీక్ష మరియు రెండు అధిక అవతారాలు. కాత్సాయనీ దేవి, మహాచండి దేవి. ఉంటుందని నవరాత్రులు ప్రారంభం శుభసందర్భంగా దుర్గాదేవి గురు స్వామి పాతిర్ల గిరి బాబు రెడ్డి వివరించారు.

## స్వర్ణభారతిలో రెడ్ డే

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు20(వార్త):** స్థానిక స్వర్ణభారతి విద్యాసంస్థల ఆధ్వ ర్యంలో రెడ్‌డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మేధాశక్తి పెంపొం దించేందుకు ఎరుపు డ్రెస్, ఎరుపు రంగు పూలు, ఎరుపు రంగు పళ్లు తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చైర్మన్ చాట్ల తులసీదాసు రెడ్డి కార్యక్రమం ప్రారంభించా రు.హెచ్ఎం శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ విజయలక్ష్మి, గుణవతి పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పలువురిని పరామర్శించిన చింతాడ



**సరుబుజ్జిలి, సెప్టెంబర్ 20(వార్త):** వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను ఆమదాలవలస వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ శనివారం పరామ ర్శించారు. చిగురువలస గ్రామానికి చెందిన నెతింటి సిమ్మమ్మ, మతలబుపేట గ్రామం చెందిన సనపల నారాయణరావు, వీరభద్రపురం గ్రామానికి చెందిన కోట సింహాచలం కుటుంబాలను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



**పలాస, సెప్టెంబరు 20(వార్త):** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దీని వల్ల కలిగే లాభాలను అందరూ గ్రహించి మన పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు సూచించారు. స్వచ్ఛభారత్-2025లో భాగంగా "స్వచ్ఛత హి సేవ" (స్వచ్ఛోత్సవ్) కార్యక్రమంలో చెత్త వేసే ప్రదేశాలను (క్లీన్లీ నెస్ టార్గెట్ యూనిట్స్) శుభ్రం చేసి, అక్కడ చెత్త పునరావృతం కాకుండా బ్యూటిఫికేషన్ చేయడంలో భాగంగా రంగురంగుల ముగ్గులు వేసి, మరలా అక్కడ ఎవరూ కూడా మళ్ళీ చెత్త వేయరాదనే భావనను ప్రజలకు కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యమని కమిషనర్ నడిపేన రామారావు తెలియజేశారు. ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఏపీ కార్యక్రమం కింద మొక్కలు నాటే కార్యక్రమం జరిగిందని, పలాస, కాశీబుగ్గ జంట పట్టణాలలో, ఐ లవ్ పలాస జంక్షన్ వద్ద, నెహ్రూ పార్క్, పలాస వద్ద మొక్కలు నాటే కార్యక్రమంను చేపట్టడం జరిగిందని తెలిపారు. కాశిబుగ్గ సంత మైదానం వద్ద శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు మరియు స్థానిక ప్రజలతో కలిసి ప్రజలలో చైతన్యం కల్పించడానికి ర్యాలీని నిర్వహించి, జీడి ప్రక్క సెంటర్ పలాస వద్ద స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిశుభ్రత అనేది నిరంతర ప్రక్రియ అని దీనిని ప్రతి ఒక్కరూ తమ తమ ఇంటి నుంచే మొదలు పెట్టాలని కాలువలలో రోడ్లపైన బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయరాదని, సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధాన్ని అందరం కలిసి అమలు చేయాలని కమిషనర్ ప్రజలను కోరారు.

## విజయవాడ ధర్నాను విజయవంతం చేయండి



**ఎల్ఎన్ పేట, సెప్టెంబర్ 20(వార్త):** పాఠాలు చెప్పేందుకు అవకాశం ఇవ్వండని,బోధనేతర పనులనుండి విముక్తి కలిగించాలని,ఉద్యోగి ఉమ్మడి సర్వీసు రూల్స్ సాధన,12వ పిఆర్సీ, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సిపిఎస్ రద్దు,మెమో 57 అమలు, పెండింగ్ బకాయిలు, పెండింగ్ డిఎలు విడుదల,11వ పిఆర్సీ బకాయిలు తదితర డిమాండ్ల సాధనకై అక్టోబర్ 7న విజయవాడ ధర్నా చౌక్ నందు రాష్ట్ర స్థాయి ధర్నాలో మన జిల్లా నుండి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని చలో విజయవాడను విజయవంతం చేయాలని శ్రీకాకుళం ఫ్యాప్టో నాయుకులు జి.రమణ పిలుపునిస్తూ లక్ష్మీ నర్సుపేట మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లక్ష్మీ నర్సు పేట నందు తరగతలు మిగిసిన తరువాత పాఠశాల ఆవరణలో ధర్నా కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు ఫ్యాప్టో నాయుకులు జి.రమణ మాట్లాడుతూ పెండింగ్ సమస్యల సాధనకై జిల్లా నుండి ఎక్కువ మంది ఉపాధ్యాయులు అక్టోబర్ 7విజయవాడ ధర్నాలో పాల్గొని ఉపాధ్యాయ ఉద్యమ తీవ్రతను ప్రభుత్వానికి తెలియజేయాలని ఉపాధ్యాయులను కోరారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి




**పలాస, సెప్టెంబరు 20(వార్త):** సమాజంలో ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పలాస ఆర్టిసి డిపో మేనేజర్ ఎం ఎస్ ఎస్ నాయుడు పిలుపునిచ్చారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో కదంబ, బాదం, చెర్రీ, మామిడి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎం ఎస్ ఎస్ నాయుడు మాట్లాడుతూ ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణం పరిసరాలను పరిశుభ్రత చేసి పర్యావరణ సమతుల్యం కోసం మొక్కలు నాటడం జరిగిందని, ప్రయాణికుల సౌలభ్యం కోసం ఇతర సౌకర్యాలు కల్పించడం జరిగింది తెలియజేశారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ మాట్లాడుతూ వాహనము ఉన్న ప్రతి వ్యక్తి ఒక్కరు ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. వాహనాలు నుండి వచ్చే ఉద్గారాలను తగ్గించేందుకు ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రికల్ వాహనాలు వాడలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ సభ్యులు మల్ల మోతి లాల్, మెకానిక్ ఫోర్ మెన్ హేమంత్, హెడ్ గార్డ్ రామ్మోహన్రావు, యూనియన్ నాయకులు ఏ.వి రావు, జీకే రావు, డి.ఎస్ .రావు, వరహాలమ్మ, దండాసి తేజేశ్వరరావు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

## అక్షరాంధ్రపై శిక్షణ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు20(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వయోజన విద్యా పాలసీ ద్వారా ప్రారంభించబడిన ఉల్లాస్ కార్యక్రమం అనగా వయోజన విద్య ను అందించడానికి "అక్షరాంధ్ర" అనే కార్యక్రమం ద్వారా వయోజనులకు విద్యను అందించుటకు, పురపాలక సంఘం పరిధిలో కమీషనర్ ఎన్. రమేష్ అధ్యక్షతన స్థానిక మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్లో వయోజన విద్య వాలంటరీలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా టిఎంసి బోర భాస్కర రావు, సీవో సంతోష్ కుమార్, ఆర్పి లు పాల్గొన్నారు, కంబాల చంద్రశేఖరం మరియు కే సాయిరాం లు వాలంటీర్లకు ఒక రోజు శిక్షణ అందించారు.

# కాలుష్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

**పలాస, సెప్టెంబరు 20(వార్త):** జీడి పరిశ్రమల్లో కాలుష్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అటు అధికారులు ఇటు ప్రజలు ఎంత ముత్తుకున్నప్పటికీ జీడీ పరిశ్రమల యజమానులు వారు పనేదో పని చేసుకుంటూ పోతున్నారు. పొల్యూషన్ గాని పొగ గాని రాకుండా చూసుకోవాలని పరిసర ప్రాంతాల ప్రజారోగ్యానికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, లేనట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని యజమానులను సాక్షాత్తు పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు హెచ్చిరిస్తున్న జీడి పరిశ్రమ యజమానుల్లో చలనం లేకపోవడం ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. శనివారం ఉదయం 6 గంటలకు సమయంలో పలు పరిశ్రమల నుంచి జీడి పొగ దట్టంగా వెదజల్లుతుందని, ఆ సమయాల్లో ప్రయాణిస్తున్న ప్రజలు కనిపించకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కమిషనర్ సాక్షిగా కాల్పులు జరుగుతున్న అధికారుల్లో చలనం లేదని పంపిస్తున్నారు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులుస్పందించి



పట్టణ నడిబొడ్డిలో జరుగుతున్న జీడీ పరిశ్రమంలో కాలుష్యం భూతాన్ని ఆపాలని ప్రజలు కోరుతున్నారు.

## చిన్నదూగాం పాఠశాలలో స్వర్ణాంధ్ర



**జలుమూరు, సెప్టెంబరు 20(వార్త):** చిన్నదూగాం ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎంఈఓ బమ్మిడి మాధవరావు పాల్గొన్నారు. పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ రక్షణ పట్ల ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అంతేకాకుండా పాఠశాల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

# క్యాన్సర్‌ను అధిగమిద్దాం



**పలాస, సెప్టెంబరు 20(వార్త):** అవగాహనతో క్యాన్సర్ ను అధిగమిద్దాం అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలకు క్యాన్సర్ వ్యాధుల నివారణపై అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి అధ్యక్షత నిర్వహించారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో పలాస పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హరిజన వీధి వైద్యులు డాక్టర్ దివాకర్, సి.హెచ్. ధనలక్ష్మి, హెచ్.ఎస్.బి. వాణిశ్రీ, ఏఎన్ఎంలు కే. సంగీత, రేవతి, పుష్ప, సిమ్మమ్మ తదితర ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో 120 మంది విద్యార్థినులకు హిమోగ్లోబిన్, రక్తపోటు, డయాబెటిస్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు ఐరన్ టాబ్లెట్స్, కాల్షియం, విటమిన్-బి కాంప్లెక్స్ టాబ్లెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఇండియన్ రెడ్ క్రాస్ క్లబ్ మరియు వుమెన్ ఎంపవర్మెంట్ సెల్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి మాట్లాడుతు విద్యార్థినులు తప్పనిసరిగా రక్తపరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత ఉంటే పౌష్టికాహారం తీసుకోవాలని, ఇటీవలి కాలంలో స్త్రీలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి కనుక ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని అన్నారు. ఆధునిక సాంకేతికతలతో కీమోథెరపీ, రేడియో థెరపీ, ఇమ్యునో థెరపీ వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, క్యాన్సర్‌పై విజయానికి నివారణ, అవగాహన, పరిశోధన ముఖ్యమైనవి" అని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎల్. గణపతి రావు, కామర్స్ అధ్యాపకులు ఎం. శ్రీనివాస్ పట్నాయక్, పి. వెంకటరమణ, గ్రంథాలయాధికారి బి. నర్సింహులు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.గిరిజ, ఆంగ్ల అధ్యాపకులు ఆర్. దీప కుమారి తదితరులు పాల్గొన్నారు.

## కేసుపురంలో పూరిల్లు నేలమట్టం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు20(వార్త):** మండలంలో గత కొన్ని రోజుల క్రితం కురిసిన చెదురుముదురు వర్షాలకు కేసుపురంలోని ఎగువ వీధికి చెందిన దూడ.మోహినమ్మ ఇంటి గోడ శుక్రవారం రాత్రి కూలింది. ఈ సమయంలో



పరిసర ప్రాంతాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వర్షాలకు పూరి గుడిసె కావడంతో గోడ నాని పడిపోయినట్లు మోహినమ్మ తెలిపారు. విషయం తెలుసుకున్న కేసుపురం పంచాయతీ టీడీపీ ప్రధాన కార్యదర్శి గుజ్జు.భీమరాజు రెడ్డి ఇంటిని పరిశీలించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546